నేరడగంలో ముళ్లకంపలతో నిండిన క్రీడాప్రాంగణం



అమ్మపల్లిలో ఇలా..



వర్కూర్‌లో అస్తవ్యస్తంగా మైదానం



బైరంపల్లిలో పశువులకు అడ్డాగా ఆటస్థలం



క్రీడా ప్రాంగణాలు.. సమస్యల నిలయాలు

గత ప్రభుత్వ హయంలో గ్రామాల్లో ఏర్పాటు చేసిన క్రీడా ప్రాంగణాలపై నీలినీడలు కమ్ముకున్నాయి. క్రీడాభివృద్ధే ధ్యేయంగా ప్రభుత్వం గ్రామాల్లో క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసింది. అయితే ఈ ప్రాంగణాలలో సరైన సౌకర్యాలు కల్పించకపోవడం అలాగే గ్రామాలకు ఊరికి దూరంగా ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. దీంతో క్రీడా ప్రాంగణాలు మొత్తం పిచ్చి మొక్కలు పెరిగి కళావిహీనంగా తయారయ్యాయి. కొన్ని చోట్ల అసాంఘిక కార్యకలాపాలు, మందుబాబులకు అడ్డాగా మారుతున్నాయి. ఇప్పటికైనా అధికారులు దృష్టి పెట్టి క్రీడాప్రాంగణాలను బాగు చేసి సౌకర్యాలు కల్పించాలని క్రీడాకారులు కోరుతున్నారు. - మాగనూర్

క్లుప్తంగా

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

మద్దూరు: పట్టణ శివారులోని 132/33 కేవీ సబ్‌స్టేషన్‌లో మరమ్మతు పనుల కారణంగా ఆదివారం ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు సబ్‌స్టేషన్ ఏడీ ప్రభాకర్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి మద్దూరు, దామరగిద్ద మండలాలకు విద్యుత్ సరఫరా ఉండదని వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

దామరగిద్ద: మద్దూర్ విద్యుత్ ఉప కేంద్రంలో మరమ్మతు కారణంగా ఆదివారం మండలంలోని మొగుల్‌మడ్క, దామరగిద్ద, క్యాతన్‌పల్లి, కాన్‌కుర్తి , లోకూర్తి ఉప కేంద్రాల పరిధిలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని విద్యుత్ ఏఈ అనిల్‌కుమార్ తెలిపారు. రైతులు, గృహ వినియోగదారులు గమనించి సిబ్బందికి సహకరించాలని కోరారు.

మక్తల్ మార్కెట్ యార్డు కార్యదర్శిగా భారతి



మక్తల్: మక్తల్ మార్కెట్ యార్డు కార్యదర్శిగా భారతి శనివారం బాధ్యతలు చేపట్టారు. అనంతరం మార్కెట్ యార్డు చైర్‌పర్సన్ రాధమ్మ కార్యదర్శి భారతిని శాలువాతో సన్మానించారు. రైతులకు మద్దతుగా తన వంతు కృషి చేస్తానని నూతన కార్యదర్శి తెలిపారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ లక్ష్మారెడ్డి, మార్కెట్ యార్డు వైస్ చైర్మన్ గణేశ్‌కుమార్, మార్కెట్ డైరెక్టర్లు విష్ణువర్ధన్‌రెడ్డి, రంజిత్‌కుమార్‌రెడ్డి, ఫయాజ్, శ్రీనివాసులు, నాగరాజు, రాంరెడ్డి, నాగప్ప తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడికి సన్మానం



నారాయణపేట రూరల్: బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడైన బండారి శాంతికుమార్‌ను బీజేపీ నేతలు శనివారం ఘనంగా సన్మానించారు. ఇటీవల ప్రకటించిన బీజేపీ రాష్ట్ర నూతన కార్యవర్గంలో ఉమ్మడి జిల్లా నేత బండారి శాంతికుమార్ రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా నియమించబడ్డారు. ఈ క్రమంలో ఆయనను జిల్లా నాయకులు నాగురావు నామాజీ, రతంగ్ పాండురెడ్డి, కొండ సత్య యాదవ్, రఘువీర్ యాదవ్, శ్రీనివాసులు, మహబూబ్‌అలీ మర్యాదపూర్వకంగా కలుసుకుని శాలువాతో సన్మానించి అభినందించారు.

దివంగత ఐఏఎస్‌కు ఘన నివాళి



కొత్తపల్లి: దివంగత మాజీ ఐఏఎస్ అధికారి యుగందర్ 6వ వర్ధంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి స్వర్ణభారతి దివ్యాంగుల సంఘం అధ్యక్షుడు వెంకటయ్య పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ రాష్ట్రంలోని దివ్యాంగుల సంక్షేమానికి ఎంతో కృషి చేశారని, తన వేతనాన్ని కూడా అంగవైకల్యం కలిగిన ఎంతోమంది పేదలకు చికిత్స చేయించడానికి వినియోగించాడని ఆయన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో దివ్యాంగుల సంఘం నాయకులు సాయిలు, చెన్నయ్య, నాగమ్మ, తులసిరాం, వెంకట్, సంతోష్ కుమార్, బాలకృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

వంతెన.. నిర్మాణమయ్యేనా



మన్నెవాగును ప్రమాదకరంగా దాటుతున్న మహిళలు (ఫైల్)

- బ్రిడ్జి కోసం ప్రజల ఎదురుచూపులు
- పట్టించుకోని అధికారులు

ధన్వాడ: మండలకేంద్రంలో వర్షకాలం వస్తే చాలు ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. భారీ వర్షాలకు మండలంలోని వాగులు ఉధృతంగా ప్రవహిస్తుండడంతో చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లాలంటే నరకయాతన పడాల్సి వస్తుందని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యంగా ధన్వాడ నుంచి ఎమ్మానోనిపల్లి, గున్ముక్ల, మంత్రోనిపల్లి గ్రామాలకు అలాగే ధన్వాడ నుంచి పాతపల్లి గ్రామాలకు రాకపోకలు నిలిచిపోతున్నాయి. అదే కంసాన్‌పల్లి వద్ద ఉన్న మాన్నెవాగు, పాతపల్లి రోడ్డులో ఉన్న వాగులపై బ్రిడ్జి ఏర్పాటు చేస్తే తమకు ఈ తిప్పలు తప్పుతాయని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. వంతెన నిర్మించాలని కొన్నేళ్ల నుంచి విన్నవిస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని దీంతో ఏటా వర్షాకాలం వస్తే చాలు రాకపోకలు నిలిచిపోయి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మన్నెవాగుపై..

మండల కేంద్రమైన ధన్వాడ నుంచి కంసాన్‌పల్లి మీదుగా ఎమ్మానోనిపల్లి, గున్ముక్ల, మాంత్రోనిపల్లి గ్రామాలకు వెళ్లే దారిలో ఎమ్మానోనిపల్లి గ్రామ శివారులో ఉన్న మన్నెవాగు ఏటా వర్షాలకు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. అత్యవసర సమయంలో ధన్వాడకు వచ్చే వీలులేకుండా పోతుందని గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మన్నెవాగుపై నీరు పారుతుందని మండల కేంద్రానికి ప్రధాన రహదారి అయిన ఈ దారిలో దాదాపు 5 గ్రామాల ప్రజలు రాకపోకలు కొనసాగిస్తుండడంతో అత్యవసర సమయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుందని ప్రభుత్వం స్పందించి వెంటనే బ్రిడ్జి నిర్మించాలని కోరుతున్నారు.

విద్యార్థులకు తప్పని ఇబ్బందులు

పాతపల్లి నుంచి ధన్వాడకు వచ్చేందుకు కేవలం ప్రధాన రోడ్డు సౌకర్యం మాత్రమే ఉంది. ఈ రోడ్డుపై ఉన్న సొటవాగు వర్షానికి నిండి బ్రిడ్జిపై నుంచి వాగు పారినా ప్రతి సారి రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో ధన్వాడలో చదువుకుంటున్న విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు.

కల్వర్టు ఏర్పాటు చేయలి



మన్నెవాగుపై కల్వర్టు ఏర్పాటు చేయాలి. ఏటా వర్షాకాలం సమయంలో అధికారులు వచ్చి చూసిపోతున్నారు తప్ప సమస్య పరిష్కరించడం లేదు. వెంటనే కల్వర్టు నిర్మాణం చేపట్టేలా చుడాలి.

\- సచిన్, ఎమ్మానోనిపల్లి గ్రామం

బ్రిడ్జి నిర్మించాలి



పాతపల్లి గ్రామం నుంచి నిత్యం కళాశాలకు, పాఠశాలకు చదువుకోసం తమ గ్రామం నుంచి పదుల సంఖ్యలో విద్యార్థులు ధన్వాడకు వస్తుంటారు. వర్షకాలం వస్తే చాలు సొటవాగుపై ఉన్న బ్రిడ్జి పైనుంచి నీరు పారుతుండడంతో రాకపోకలు నిలిచిపోతున్నాయి. దీంతో విద్యార్థులు, గ్రామస్థులు ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజాప్రతినిధులు స్పందించి బ్రిడ్జి నిర్మిస్తే బాగుంటుంది.

\-తిరుమలేష్, పాతపల్లి

బీజేపీ అభ్యర్థుల గెలుపునకు కృషి చేద్దాం

మరికల్: బీజేపీ కార్యకర్తల్లో కసి కృషి ఉంటే మరికల్ ఎంపీపీ సీటును కై వసం చేసుకుంటామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కొండయ్య, జిల్లా అధికార ప్రతినిధి నర్సన్‌గౌడ్‌లు అన్నారు. మండల కేంద్రంలో శనివారం మండల పార్టీ ఆధ్వర్యంలో సేవా పక్షం మండల కార్యశాల కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 17న ప్రధాని మోదీ జన్మదినం సందర్భంగా మండల స్థాయిలో స్వచ్ఛభారత్, బూత్ స్థాయిలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టాలని సూచించారు. అలాగే త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ గెలుపునకు అందరూ కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. అత్యధిక స్థానాల్లో సర్పంచులు, ఎంపీటీసీలను గెలిపించుకోవడానికి ఇదే మంచి అవకాశం అన్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షులు వేణు, భాస్కర్‌రెడ్డి, రమేష్, రాజేష్, మహేష్‌శెట్టి, వెంకటేష్, మోహన్‌రెడ్డి, పాపిరెడ్డిలు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర బీజేపీ కార్యవర్గ సభ్యుడు కొండయ్య

చెరువులో చేప పిల్లల విడుదల

ధన్వాడ: మండలంలోని ధన్వాడ, హన్మన్‌పల్లి గ్రామాలలో మత్స్యపారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో చేపల పెంపకానికి శ్రీకారం చుట్టారు. శనివారం కృష్ణాజిల్లా కై కలూరు నుంచి తెచ్చిన చేపలను గ్రామంలోని చెరువులో విడుదల చేశారు. ధన్వాడలో రెండు లక్షల చేప పిల్లలు అలాగే హన్మన్‌పల్లిలో లక్ష చేప పిల్లలను చెరువులో వదిలారు. చేపలలో బొచ్చ, రోహు, బంగారు తీగ, గడ్డి చేప రకం ఉన్నాయి. కార్యక్రమంలో జిల్లా మత్స్యపారిశ్రామిక సంఘం ఉపాధ్యక్షులు నర్సింములు నాయుడు, హన్మన్‌పల్లి అధ్యక్షుడు మోహన్, ఉపాధ్యక్షుడు నారాయణ, కార్యదర్శి శ్రీనివాసులు, రాంచంద్రయ్య, శివ, వెంకటయ్య, సురేష్, వెంకటరాములు తదితరులు పాల్గొన్నారు.



హన్మన్‌పల్లిలో చెరువులో చేప పిల్లలను వదులుతున్న ముదిరాజులు

ఇసుక రీచ్‌ల పరిశీలన

మాగనూర్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగం పెంచాలని మంత్రి వాకిటి శ్రీహరి ఆదేశించడంతో శనివారం మాగనూర్, నర్వ మండలాల తహీల్దార్‌లు మాగనూర్ పెద్దవాగును పరిశీలించారు. ఈ సందర్భంగా మాగనూర్ ఇన్‌చార్జి తహసీల్దార్ సురేశ్‌కుమార్ మాట్లాడుతూ.. ఇసుక కొరత వలన మండలంలో ఇళ్ల నిర్మాణం జరగడం లేదని తెలియడంతో రీచ్‌లను పరిశీలించినట్లు తెలిపారు. ఇసుక కొరతను తీర్చడానికి వర్కూర్ శివారులోని ఆన్‌లైన్ రీచ్ నుంచి ట్రాక్టర్ల ద్వారా నర్వ మండలానికి ఇసుక సరఫరా చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చెన్నయ్యసాగర్, దాసర్‌పల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.



ఇసుక రీచ్‌ను పరిశీలిస్తున్న అధికారులు

15న మంత్రుల ఇళ్ల ఎదుట ధర్నా

మక్తల్: అంగన్‌వాడి సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ ఈనెల 15న మంత్రుల ఇళ్ల ముందు ధర్నా కార్యక్రమం చేపట్టినట్లు సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి గోవిందురాజ్, ఉపాధ్యాక్షుడు ఆంజనేయులు తెలిపారు. ఈ మేరకు శనివారం మక్తల్ సీడీపీఓ సరోజినిమట్టకు వినతిపత్రం అందజేశారు. ప్రీ ప్రైమరీ, పీఎం విద్యాను అంగన్‌వాడి కేంద్రాలకు అప్పగించాలని కోరారు. తమ డిమాండ్లను నెరవేర్చాలని లేకపోతే ఈనెల 25న చలో సెక్రటేరియట్ కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడి టీచర్లు రామలింగమ్మ, శోభరాణి, రాజేశ్వరి, మంజుల, లత, రాధిక, చంద్రకళ, నర్సింగమ్మ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

అమరచింత: రాజ్యాంగం ప్రజలకు కల్పించిన చట్టాలపై ప్రతి విద్యార్థిని అవగాహన కలిగి ఉండాలని ఎస్‌ఐ స్వాతి అన్నారు. మండలంలోని పాంరెడ్డిపల్లె శివారులోని కేజీబీవీలో శనివారం వందేమాతరం ఫౌండేషన్ ద్వారా అక్షరజ్యోతి కార్యక్రమంలో భాగంగా గ్రామసభలో పాల్గొని విద్యార్థినులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ.. గురుకులాలు, కేజీబీవీలలో చదువుకుంటున్న వారికి ప్రభుత్వం అన్ని సౌకర్యాలను కల్పించి నాణ్యమైన విద్యను అందిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఓ స్వప్నరాణి, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

తల్లిదండ్రుల ప్రోత్సాహం తప్పనిసరి

మాగనూర్: విద్యార్థులు చదువుకొని భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలు చేరుకోవడానికి తల్లిదండ్రుల ప్రోత్సాహం తప్పనిసరని ఎస్సీ బాలుర వసతి గృహం వార్డెన్ అష్ఫల్ అహ్మద్ అన్నారు. సీజనల్ వ్యాధులు ప్రబలుతున్న నేపథ్యంలో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశమై మాట్లాడారు. ఈ సందర్భంగా వసతి గృహంలో విద్యార్థులకు కల్పిస్తున్న వసతుల గురించి వారికి వివరించారు. అనంతరం వసతి గృహంలో వండిన భోజనాన్ని తల్లిదండ్రులు పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు, వసతిగృహ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

గిరిజన హాస్టళ్ల సిబ్బంది వేతనాలు పెంచాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: గిరిజన ఆశ్రమ హాస్టళ్లలో విధులు నిర్వహిస్తున్న కాంటింజెట్ కార్మికులకు వేతనాలు పెంచాలని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కురుమూర్తి కోరారు. ఈ మేరకు కార్మికులు జిల్లా కేంద్రంలోని ఎస్టీ హాస్టల్ వద్ద చేపట్టిన నిరసనకు సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం వెంటనే కార్మికుల న్యాయమైన డిమాండ్లను నెరవేర్చాలని పేర్కొన్నారు. కనీస వేతనం రూ.26వేలు ఇవ్వాలని, ఈఎస్‌ఐ, పీఎఫ్ వంటి సౌకర్యాలు కల్పించాలన్నారు. అందరితోపాటు సాధారణ సెలువులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో లక్ష్మి, జ్యోతి, రుక్మిణి, స్వరూప, అనిత, భీమమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యూనిఫాం పంపిణీ

నారాయణపేట రూరల్: మండలంలోని అమ్మిరెడ్డిపల్లి ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు యూనిఫాం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ రాజమ్మ మాట్లాడుతూ.. విద్యార్థులు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకొని బాగా చదువుకోవాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి మహేష్ కుమార్, బుక్ కీపర్ అలివేలమ్మ, ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు రఘువీర్, వెంకట్రాములు, అమల, ఫీల్డ్ అసిస్టెంట్ బలకిష్టప్ప, కారోబార్ మహేశ్, గ్రామస్తులు పాల్గొన్నారు.

హాస్టల్‌లో వైద్యశిబిరం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా కేంద్రంలోని ఎస్సీ బాలికల హాస్టల్‌లో కేవీపీఎస్ సంఘం ఆధ్వర్యంలో స్మైలీ అండ్ షైనీ డెంటల్ ఆస్పత్రి సౌజన్యంతో విద్యార్థులకు వైద్యశిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఏఎస్‌డబ్ల్యూఓ సుదర్శన్ ప్రారంభించి మాట్లాడారు. వర్షాల సీజన్ కావడంతో విద్యార్థులకు సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని, వైద్యం కోసం డబ్బులు ఖర్చు చేసుకునే పరిస్థితి ఉందని, ఇలాంటి క్రమంలో డాక్టర్లు ఇక్కడికి వచ్చి వైద్యం చేసి మందులు కూడా ఇవ్వడం గొప్ప విషయమని డాక్టర్‌లను అభినందించారు. వార్డెన్ మధులత, డాక్టర్‌లు దిగ్విజయ్, సమత, అంజని, కేవీపీఎస్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాణిక్యంరాజు, కురుమయ్య పాల్గొన్నారు.

38వ రోజుకు రిలే నిరాహార దీక్షలు

దామరగిద్ద: పేట–కొడంగల్ ఎత్తిపోతల పథకంలో భాగంగా కాన్‌కుర్తి రిజర్వాయర్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న భూ నిర్వాసితులు చేపట్టిన రిలే దీక్షలు శనివారంతో 38వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా భూ నిర్వాసిత సంఘం నాయకులు వెంకట్‌రెడ్డి, బీంరెడ్డి, జ్ఞానేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ రైతులకు స్పష్టమైన హామీ ఇచ్చేంత వరకు దీక్షలు విరమింపజేయమన్నారు. ఎకరాకు రూ.20 లక్షల పరిహారం ఇస్తామని ప్రకటించినా రైతులకు విశ్వాసం కలిగేలా రెవెన్యూ అధికారులు, స్థానిక ఎమ్మెల్యే స్పందించి రైతులకు ప్రయోజనం చేకూర్చే వరకు దీక్షను విరమించేది లేదన్నారు. దీక్షలో రాములు, తమ్మప్ప, ఆశప్ప, భీంషప్ప, కమిటీ నాయకులు పాల్గొన్నారు.



రిలే దీక్షలో పాల్గొన్న రైతులు

కోతుల నుంచి రక్షించాలని నిరసన

మద్దూరు: పట్టణంలో కోతుల బెడద ఎక్కువగా ఉందని, కోతుల నుంచి తమను రక్షించాలని పట్టణ వాసులు కోరుతున్నారు. ఈ మేరకు ప్రజా సంఘాల ఆధ్వర్యంలో శనివారం పాత బస్టాండ్ చౌరస్తాలో ధర్నా చేపట్టారు. 10 రోజులుగా కోతుల దాడులు పెరిగిపోయాయని, ఇప్పటి వరకు దాదాపు 10 మందిపై దాడి చేయడంతో బాధితులు ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారన్నారు. పుర అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని వాపోయారు. అటవీ, పుర సిబ్బంది, పోలీసులు కోతుల కట్టడికి చర్యలు తీసుకోవాలని లేకపోతే పెద్దఎత్తున పోరాటం చేపడతామని హెచ్చరించారు. చివరికి పోలీసులు జోక్యం చేసుకొని ధర్నాను విరమింపజేశారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు ఆశోక్, మహ్మమద్ అలీ, భతర్, సుక్కప్ప, నర్సప్ప, తదితరులు పాల్గొన్నారు.



పాతబస్టాండ్ చౌరస్తాలో ధర్నా చేస్తున్న ప్రజా సంఘాల నాయకులు

విద్యార్థులు లక్ష్యాన్ని నిర్దేశించుకొని చదవాలి

మద్దూరు: విద్యార్థులకు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని పోటీతత్వంతో చదువుకోవాలని మద్దూరు డిగ్రీ కళశాల ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి అన్నారు. శనివారం డిగ్రీ కళశాల ఆవరణలో ఫ్రెషర్స్ డే నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ డిగ్రీ కళశాల ఏర్పడి రెండేళ్లు అవుతుందని విద్యార్థులు బాగా చదువుకొని తల్లిదండ్రులకు, కళశాలకు గుర్తింపు తీసుకురావాలని సూచించారు. అనంతరం విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమంలో ఎస్‌ఐ విజయ్‌కుమార్, ఎస్ఎల్‌డీసీ పూర్వ ఉపన్యాసకుడు రవీంద్రనాథ్, ఉపన్యాసకులు జనార్దన్, బాలరాజ్, నసీర్, ఈశ్వర్, నవీన్, అఖిలేంద్ర, సత్యమ్మ, మణెమ్మ, సవిత, గ్రీష్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ కృష్ణారెడ్డి

మండల పరిషత్ భవనానికి హంగులు



పాత మండల పరిషత్ భవనానికి మరమ్మతు చేస్తున్న కార్మికులు

దేవరకద్ర: దేవరకద్ర మున్సిపాలిటీ కేంద్రంలోని పాత మండల పరిషత్ కార్యాలయ భవనానికి కొత్త హంగులు దిద్దుతున్నారు. దాదాపు 70ఏళ్ల క్రితం అప్పటి సమితి కోసం నిర్మించిన భవనం సమితులను రద్దు చేసిన తర్వాత ఈ భవనాన్ని ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు కేటాయించారు. నాలుగు దశాబ్దాలుగా పాఠశాలను ఇక్కడ నిర్వహించిన తర్వాత మరో కొత్త భవనంలోకి పాఠశాలను మార్చారు. మండల వ్యవస్థ ఏర్పడిన తర్వాత భవనాన్ని మండల పరిషత్‌కు కేటాయించారు. రెండు దశాబ్దాలపాటు మండల పరిషత్‌కు ఉపయోగించిన తర్వాత కొత్త భవనం నిర్మాణంతో మండల పరిషత్‌ను ఇక్కడి నుంచి తరలించారు. ఆ తర్వాత కొంతకాలం వ్యవసాయ శాఖకు కేటాయించగా వ్యవసాయ శాఖ కార్యాలయాన్ని రైతువేదికలకు తరలించి ఇటీవల మిషన్ భగీరథకు కేటాయించారు. ప్రస్తుతం ఇదే భవనం కొత్తగా ఏర్పాటు చేసే కోర్టుకు కేటాయించారు. దీంతో దాదాపు రూ.40లక్షలతో పాత మండల పరిషత్ భవనానికి మరమ్మతులు చేపట్టారు. దసరా పండుగకు కోర్టును ప్రారంభించాలని నిర్ణయించడంతో రాయిచూర్ రోడ్డులోని ఓ ప్రైవేట్ భవనంలో తాత్కాలికంగా కోర్టును ఏర్పాటు చేయడానికి సిద్ధం చేస్తున్నారు.

రోడ్లకు మరమ్మతు చేపట్టాలి



యాంకి, పెద్దకడ్మూర్ గ్రామాల మధ్య అధ్వాన్నంగా తయారైన బీటీ రహదారి

నర్వ: మండలంలోని ఆయా గ్రామాల్లో గుంతలమయంగా మారిన రోడ్లను బాగు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. నర్వ నుంచి లక్కర్‌దొడ్డి మీదుగా కొత్తపల్లి వరకు పెద్దకడ్మూర్ నుంచి కొత్తపల్లి, యాంకి నుంచి పెద్దకడ్మూర్ గ్రామాలకు వెళ్లే రహదారులు పూర్తిగా అధ్వానంగా తయారయ్యాయన్నారు. ఇటీవల వరుసగా కురుస్తున్న ముసురు వర్షాలతో రోడ్లపై మోకాళ్ల లోతు గోతులు పడి నీళ్లు నిలవడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. పంచాయతీరాజ్, ఆర్ అండ్‌బీ అధికారులు స్పందించి తాత్కాలిక మరమ్మతులు అయినా చేపట్టి గుంతలను పూడ్చి వేయాలని కోరుతున్నారు.



రాళ్లు తేలిన నర్వ-లక్కర్‌దొడ్డి రోడ్డు